క్లుప్తంగా

రంగనాథుడికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో దేవేరులతో స్వామి వారు

మద్దికెర : మండలంలోని శ్రీరంగనాథస్వామి వారికి కార్తీక మాసం శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బిందె సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు. స్వామి వారికి అష్టోత్తర నామార్చన, మంగళహారతి తదితర పూజలు చేపట్టి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఈఓ వీరయ్య, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం బస్తాలు

హొళగుంద: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు. గ్రామానికి చెందిన సలీం ఇంట్లో తనిఖీలు చేపట్ట గా 28 బస్తాల (1,360 కిలోలు) బియ్యం లభ్య మైంది. దీంతో ఆ బియ్యాన్ని సీజ్ చేసి తదుపరి చర్యలు చేపడతామని ఎస్ఐ వెల్లడించారు.

వాహనాల తనిఖీ


వాహనదారుల ధ్రువ పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ బాలనరసింహులు

హొళగుంద: స్థానిక ఆదోని– ఎల్లార్తి రోడ్డులో శనివారం ఎస్ఐ బాలనరసింహులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించి ఆర్‌సీ, ఇతర రికార్డులను పరిశీలించారు. ఓవర్‌లోడ్‌తో పాటు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న, సరైన రికార్డులు లేని వాటికి జరిమానాలు విధించారు. నిబంధనల మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలని, లేకపోతే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


తుగ్గలిలో కారును తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ పులిశేఖర్

తుగ్గలి : వాహన డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ అన్నారు. శనివారం రాత్రి తుగ్గలిలో వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారుల ఆర్‌సీ బుక్, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారులు నిర్దిష్ట వేగంతోనే వాహనాలను నడపాలన్నారు. నంబర్ ప్లేటు తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పత్రాలు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు.

11 నుంచి కార్తీక మాస ధార్మిక ప్రవచన సప్తాహం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక మాసం విశిష్టతపై ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు ధార్మిక ప్రవచన సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిటిడే హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓర్వకల్ మండలంలోని శ్రీ జీవేశ్వర స్వామి దేవస్థానం, నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డలోని శ్రీ అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో ధార్మిక ప్రవచకులచే ధార్మిక ప్రవచన సప్తాహం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13వ తేదీన కల్లూరు మండలం పర్ల గ్రామం, గూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీల్లో శ్రీ లక్ష్మీచెన్న కేశవ స్వామి ఆలయం, నంద్యాల మండలం పొన్నాపురం, ఆళ్లగడ్డలోని ఎస్సీ కాలనీలోని శ్రీ చెన్నకేశవ స్వామి, రామాలయంలో మంగళ కైశిక ద్వాదశి వేడుకలు, 15వ తేదీన ఓర్వకల్, ఆళ్లగడ్డలో కార్తీక దీపోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాలు ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయన్నారు. సామూహికంగా సామూహిక వ్రతం, కార్తీక పౌర్ణమి వేడుకలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పండితులు విరివింటి ఫణి శశాంక శర్మ, ఓర్వకల్ మండల ప్రముఖులు రాంభూపాల్‌రెడ్డి, వెంకట కృష్ణయ్య, గోవిందరెడ్డి, భాస్కర్ రెడ్డి, రామిరెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బీమాకు మంగళం

జగనన్న పాలనలో రైతులకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలిచింది. ముఖ్యంగా పంటల బీమా ప్రీమియం సర్కారే చెల్లించి పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఎప్పటికప్పుడు అందజేసింది. దీంతో రైతులకు బీమా భారం తప్పింది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని స్పష్టం చేయడంతో అన్నదాతలపై అధిక భారం పడింది. ఇప్పటికే అనావృష్టి, అతివృష్టితో పంటలు కోల్పోయిన వారికి.. బీమా ప్రీమియం చెల్లించాలని చెప్పడం గోరుచుట్టుపై రోకటిపోటు చందంగా మారింది.

- వైఎస్ జగన్ హయాంలో బీమా ప్రీమియం చెల్లించిన ప్రభుత్వం
- ప్రస్తుతం రైతులే చెల్లించాలంటున్న కూటమి సర్కారు
- నాడు ఒక్క రూపాయి చెల్లించకుండానే నష్టపరిహారం అందజేత
- నేడు పరిహారం కావాలంటే నగదు కట్టాల్సిందేనంటున్న చంద్రబాబు
- భారం మోయలేమంటున్న అన్నదాతలు


వర్షాలకు నేలకొరిగిన వరి పైరు

పంటలకు చెల్లించాల్సిన బీమా ప్రీమియం వివరాలు..

పంట	యూనిట్ లెవెల్	ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం	ఆఖరు తేది
పప్పు శనగ	గ్రామస్థాయి యూనిట్	రూ.420	15-12-24
వేరుశనగ	మండల స్థాయి యూనిట్	రూ.420	15-12-24
వరి	మండల స్థాయి యూనిట్	రూ.630	31-12-24
ఉల్లి	జిల్లా యూనిట్	రూ.1,350	15-12-24
టమాట	మండల స్థాయి యూనిట్	రూ.1,500	15-12-24
జొన్న	మండల స్థాయి యూనిట్	రూ.297	15-12-24

హొళగుంద/మద్దికెర : వ్యవసాయానికి జగన్ ప్రభుత్వం గత ఐదేళ్ల పాటు అండగా నిలిచింది. భూసార పరీక్షల పరీక్షల నుంచి పంట దిగుబడులను కొనుగోలు చేసి చేయిపట్టి నడిపించింది. అయితే వైఎస్సార్‌సీపీ ఉన్నన్నాళ్లు వారికి కష్టాలు పెద్దగా కనిపించలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వారికి షాకుల మీద షాకులిస్తోంది. ఎన్నికల సమయంలో పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని చెప్పి నేటికీ దాని ఊసే లేదు. ఇక ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే పరిహారం చెల్లించేందుకు ఇప్పటి వరకు అమలులో ఉన్న ఉచిత బీమాకు మంగళం పలికింది. ప్రస్తుతం రబీలో పంటలు సాగు చేసుకున్న రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసి మరో అదనపు భారం మోపింది. ఈ చర్యలతో ఎట్టకేలకు చంద్రబాబు వ్యవసాయానికి వ్యతిరేకం అనే మాట మరోసారి నిరూపితమైందని పలువురు రైతులు విమర్శిస్తున్నారు.

మారానంటూ.. మోసం!

ఎన్నికల సమయంలో తాను మారానని.. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తానని, ముఖ్యంగా అన్నదాతలకు మరింత సాయం అందిస్తానని నమ్మించి అధికారంలో వచ్చిన తరువాత చంద్రబాబు నాయుడు తన అసలు రూపాన్ని ప్రదర్శిస్తుండటంతో రైతన్నలకు దిక్కుతోచడం లేదు. ఖరీఫ్ ప్రారంభంలో అనావృష్టి కారణంగా పంటలు ఎండిపోయాయి. ఆ వెంటనే ఆగస్టు నుంచి భారీ వర్షాలు కురిసి ఉన్న పంటలు అధిక వర్షాలకు కోల్పోయారు. ఈ సమయంలో ఆపన్న హస్తం అందించాల్సిన ప్రభుత్వం కాస్తా రిక్త హస్తం చూపింది. రబీ సీజనైనా ఆదుకోకపోతుందా అని రైతులు పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఇప్పుడు కూడా సాయం అందించకపోగా.. పంటల బీమా ప్రీమియం చెల్లింపు పేరుతో అదనపు భారం మోపింది.

అన్నదాతకు అండగా జగనన్న..

రైతుపై ప్రీమియం భారం పడకుండా ఉండేందుకు జగనన్న తన ప్రభుత్వ హయాంలో 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలులోకి తెచ్చారు. పంట నమోదు ఆధారంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. దీని వల్ల పంటల బీమా భారం రైతులకు తప్పింది. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా వర్తించడంతో పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హొళగుంద మండలం వ్యాప్తంగా 2019 జూన్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు రూ.19,465 మంది రైతులకు రూ.28.24 కోట్ల పంట నష్ట పరిహారం చెల్లించింది. అంతేకాకుండా వైఎస్సార్ రైతు భరోసా కింద 8,795 మంది రైతులకు రూ.22.7 కోట్లు అలాగే 2020, 2021, 2022, 2023 ఖరీఫ్‌నకు సంబంధించి 10,534 మంది రైతులకు సూ.16.47 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని అందించి ఆదుకుంది.


అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

పత్తికొండ నియోజకవర్గంలో..

2019లో అధికారంలోకి వైస్సార్‌సీపీ ప్రభుత్వం 5 సంవత్సరాల పాటు మద్దికెర మండలంలోని 5,145 మంది రైతులకు దాదాపు రూ.9.98 కోట్లు రైతుల తరఫున ప్రీమియం చెల్లించి ఆదుకుంది. ఇలా.. పత్తికొండ నియోజకవర్గంలోని దాదాపు 56,447 మందికి రైతులకు సంబంధించిన ప్రీమియం సుమారు రూ.109.50 కోట్లు చెల్లించింది.

రైతులను ఇబ్బంది పెట్టడం తగదు



ఏడు ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశా. ప్రభుత్వాలు రైతులకు మంచి చేయాలే తప్ప రైతులకు అనుకూలంగా ఉన్న పథకాలను నిలిపివేయడం మంచి పద్ధతి కాదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఉచిత బీమా పంటల పథకం వల్ల ఎంతో మంది రైతులకు మంచి జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం బీమా బాధ్యత మాపై మోపింది. పథకాలను మరింత మెరుగ్గా అమలు చేయాలి కానీ.. ఇలా రద్దు చేయడాన్ని చూస్తే మాపై కక్ష తీర్చుకున్నట్లుగా కనిపిస్తోంది.

– సత్తిరెడ్డి, మద్దికెర

ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి



పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న చెల్లించి రైతులను ఆదుకున్నాడు. అలాగే..పంటలు నష్టపోయినప్పుడు రైతులకు పరిహారం వెంటనే అందేది. ఖరీఫ్‌లో పంటలు నష్టపోయినా ప్రభుత్వం సాయం అందించకపోగా.. పంటల బీమా చెల్లించాలని భారం మోపడం తగదు.

– శ్రీనివాసరెడ్డి, రైతు, హెబ్బటం

గడువులోగా ప్రీమియం చెల్లించాలి



రబీలో గుర్తించిన పంటలకు ప్రభుత్వం నిర్దేశించిన బీమా ప్రీమియాన్ని గడువులోగా రైతులే చెల్లించాలి. శనగ, ఉల్లి, పప్పుశనగ, వేరుశనగ, జొన్న పంటలకు డిసెంబర్ 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలి. వరి పంటకు డిసెంబర్ 31 తేదీ వరకు చెల్లించవచ్చు. పంటల బీమా ప్రీమియం చెల్లించిన వారికి మాత్రమే నష్ట పరిహారం వర్తిస్తుంది.

– ఆనంద్‌లోకదశ్, ఏఓ, హొళగుంద

ప్రీమియం చెల్లింపు అదనపు భారం



పది ఎకరాలలో పప్పు శనగ విత్తనం వేశా. గతంలో పంట సాగుకు ముందు పెట్టుబడి సాయం అందుకున్న రైతులకు కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఆ సహాయం అందకుండా పోయింది. దీంతో అప్పులు చేసి పంటల సాగు చేపట్టాం. గతంలో బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించగా, ఈ ప్రభుత్వం రైతులనే చెల్లించమంటోంది. ఇది మాకు అదనపు భారంగా మారింది.

– పరుశురాముడు, మద్దికెర

కేజీబీవీ తనిఖీ

తుగ్గలి : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పత్తికొండ ఆర్డీవో డాక్టర్ ఎస్.భరత్‌నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజనం, వంటగది, డైనింగ్ హాల్, మెనూ బోర్డు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. వసతి సౌకర్యాలపై ప్రత్యేక అధికారిణి సాహీన్‌ను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థినులకు సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షించారు. రోజువారీ సిలబస్‌తో పాటు విద్యార్థినులకు కనీస పరిజ్ఞానం ఉండేలా ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయినులకు సూచించారు. పదో తరగతి విద్యార్థినులందరూ బాగా చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి తేవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి ప్రత్యేక తరగతుల ద్వారా వారిని కూడా ముందు వరుసలో నిలపాలని కోరారు. క్రీడల్లో రాణించేలా చూడాలన్నారు. ఆటలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, దీంతో చదువుపై ఏకాగ్రత కుదురుతుందన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


ప్రజాపోరు ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : హామీలు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాయని సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న ప్రజాపోరు ధర్నా పోస్టర్లను శనివారం స్థానిక ఈశ్వరరెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..వందరోజుల పాలనలో హామీలు అమలు కాక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలపై రూ.6వేల కోట్ల భారాన్ని మోపిందన్నారు. ఎన్నికల ముందు చార్జీలు పెంచమని చెప్పి ఇప్పుడు ట్రూఅప్ చార్జీలు వసూళ్లు చేయడం దారుణమన్నారు. ఉచితమంటూ ఇసుకే లేకుండా చేసి భవన నిర్మాణ కార్మికులు పస్తులు ఉండేలా చేసిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 14న తహసీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టే ప్రజాపోరు ధర్నాను పార్టీ శ్రేణులు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు దస్తగిరి, చక్కాల్ల వెంకటేశ్వరరెడ్డి, గోపాల్, పెద్దయ్య, రంగన్న, ఉరుకుందు, ఆనంద్, మద్దిలేటి పాల్గొన్నారు.

వేడుకగా కలశాల ఊరేగింపు



కలశాలకు పూజలు చేసిన దృశ్యం, ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దప్పు వాయిద్య కళాకారుల ప్రదర్శన

హాలహర్వి: మండలంలోని బల్గోట బసవేశ్వర స్వామి ఆలయంలో నూతన కలశం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం కలశాల ఊరేగింపు కార్యక్రమాన్ని గ్రామపెద్దల ఆధ్వర్యంలో చేపట్టారు. ఆలయ అర్చకుడు ముదుకయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు సమక్షంలో డప్పు వాయిద్యాల నడుమ కలశాలను గ్రామంలో ఊరేగించారు. చివరగా ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఊరేగింపులో డబ్బు వాయిద్య కళాకారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం రుద్రాభిషేకం, మహామంగళహారతి, అనంతరం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన, సోమవారం రుద్రహోమం, గణపతిహోమం, కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేపడతామన్నారు.

యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ


ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలపై భవిష్యత్‌లో ఐక్య కార్యాచరణ చేపట్టాలని, అవసరమైతే ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మూగితాత ఫంక్షన్ హాల్‌లో రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు జరపడం లేదని పత్రికా ప్రకటన చేశారని, అయితే ప్రజల్లో ఇంకా భయాందోళనలు తొలగిపోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల భయాందోళనలను ప్రభుత్వం, అధికారులు అర్థం చేసుకొని వారి అనుకూలంగా వ్యవహరించాలని కోరారు. యురేనియం తవ్వకాలతో ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్‌లో ఏ తరహా ఉద్యమానికైనా అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఐక్య కార్యాచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నరసారావు, సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు మాలిక్‌బాషా, ఆకుల వీరేష్, నెల్లిబండ మల్లికార్జున, మహేంద్ర నాయుడు, శ్రీనివాసులు, సర్పంచ్ చిన్నరాములు, సీపీఎం నాయకులు యూసుఫ్‌బాషా, అశోక్, సీపీఐ నాయకులు భాస్కర్, రవి, కాంగ్రెస్, జనసేన పార్టీల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలేదీ?

ఆలూరు: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలును పూర్తిగా విస్మరించందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలో శనివారం వివిధ కాలనీల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, మండల కార్యదర్శి షాకీర్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారని, కానీ.. నేడు వాటిని అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారు. వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హాలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

న్యాయం పొందడం ప్రాథమిక హక్కు



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ

ఆదోని రూరల్: సత్వర న్యాయం పొందడం పౌరుడి ప్రాథమిక హక్కు అని ఆదోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ అన్నారు. శనివారం మండలంలోని బసాపురం గ్రామంలో రాష్ట్ర, జిల్లా న్యాయసేవా అధికార సంస్థల ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సహాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ ఒక్కరూ న్యాయానికి దూరంగా ఉండకూడదన్నారు. మహిళలు, పిల్లలు ఎస్సీ, ఎస్టీలు ఎలాంటి ఆదాయ పరిమితిలేకుండా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. రూ.3 లక్షలు లోపు ఆదాయం ఉన్న ప్రతిఒక్కరూ ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హులని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నల్లప్ప, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర, న్యాయవాదులు నవీన్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌కుమార్, శివకుమారస్వామి పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

కర్నూలు(సెంట్రల్): అదిగో ఇదిగో డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ సీఎం చంద్రబాబునాయుడు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ విమర్శించారు. అధికారంలోకి రాగానే పెట్టిన మొదటి సంతకానికే చంద్రబాబు పంగనామాలు పెట్టారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తానని ప్రమాణ స్వీకారం రోజు చెప్పారని, ఇప్పటికీ ఆరునెలలవుతున్నా అతీగతీ లేదన్నారు. శనివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం కారణాలు చూపి నోటిఫికేషన్ విడుదలలో మరింత జాప్యం చేసే అవకాశం కనిపిస్తోందన్నారు. డీఎస్సీ పరీక్షను జిల్లా అంతటా ఒకే పేపర్‌తో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, గౌతమ్, హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

వంతెన కూలి.. రాకపోకలు నిలిచి


గిరిగెట్ల వద్ద కూలిన వంతెనను పరిశీలించిన ఆర్డీఓ భరత్ నాయక్

తుగ్గలి : మండలంలోని గిరిగెట్ల గ్రామం వద్ద వంతెన కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం రాత్రి తుగ్గలి నుంచి కంకర లోడుతో వెళ్లిన టిప్పర్ వంతెన దాటగానే ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తుగ్గలి నుంచి గిరిగెట్ల మీదుగా అమినాబాద్, చెన్నంపల్లి, పగిడిరాయి, పి.కొత్తూరు, ఉశేనాపురం, కడమకుంట్లకు వెళ్లేవారు. వంతెన పడిపోవడంతో ప్రస్తుతం జొన్నగిరి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. కాగా కూలిన వంతెనను ఆర్డీఓ భరత్ నాయక్ శనివారం పరిశీలించారు. వంతెన వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. వంతెన ఇక్కట్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓటరు నమోదు పక్కాగా నిర్వహించాలి


పత్తికొండలో బీఎల్‌వోలకు సూచనలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

మద్దికెర : ఓటరు నమోదు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిచాలని ఆర్డీఓ భరత్‌నాయక్ సూచించారు. శనివారం మండలంలోని పెరవలి గ్రామంలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజులు పాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఓటు నమోదు చేపట్టామన్నారు. వయస్సు నిర్ధారణ పత్రాలు అందజేస్తే పరిశీలించి సంబంధిత పత్రాల్లో నమోదు చేయాలన్నారు. తప్పులను సరిచేసి ఆన్‌లైన్ చేయించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వో మల్లికార్జున ఉన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : పద్దెనిమిదేళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించాలని ఆర్డీవో డాక్టర్ ఎస్.భరత్‌నాయక్ సూచించారు. శనివారం పత్తికొండ, తుగ్గలిలో ఓటు నమోదు కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటరు దరఖాస్తులు పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. మృతి చెందిన వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలని బీఎల్‌వోలను ఆదేశించారు.

చిప్పగిరి: కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమం శని,ఆదివారం నిర్వహిస్తామని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడిన వారు ఓటరుగా నమోదుతో పాటు పేర్ల మార్పు, తప్పులు సరిచేసుకోవచ్చన్నారు. నమోదు కోసం ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై కేసులు దుర్మార్గం


బెళ్లగుండ ఆంజనేయస్వామి దర్శనార్థం వచ్చిన మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆలూరు: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కక్షగట్టి ఇష్టానుసారంగా కేసులు నమోదు చేస్తుండటం దుర్మార్గమని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలూరు గ్రామ సమీపంలోనున్న శ్రీ బెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు సూపర్‌సిక్స్ అమలు చేస్తామని హామీనిచ్చారని, అయితే నేటి వరకు ఆ పథకాల అమలు గురించి పట్టించుకోకపోవడం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. పథకాల అమలును ప్రశ్నించకుండా ఉండేందుకే తమ పార్టీ సోషల్ మీడియాపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కానీ.. కాలం ఎల్లప్పుడూ మీవైపే ఉంటుందనుకోవడం పొరపాటన్నారు. కాలం తిరగబడిన రోజు నేడు తప్పులు చేస్తున్నవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇసుక ఫ్రీ అంటూనే కొందరు ఇసుక దందా చేస్తున్నారన్నారు. శ్రీనివాసరెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాగేంద్రశెట్టి ,వైఎస్సార్‌సీపీ ఆలూరు మండల కో-కన్వీనర్ వీరేష్, మల్లికార్జున, నగేష్, తిక్కస్వామి ఉన్నారు.

రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకుందాం


మాట్లాడుతున్న హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు

కోసిగి: రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎ.చంద్రశేఖర్, వీఎస్ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ అన్నారు. శనివారం కోసిగిలోని రైల్వే గేటు సమీపంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యు.జి.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కోడి ఉరుకుందప్ప ఆధ్వర్యంలో 10వ హెచ్‌ఆర్‌ఎఫ్ జిల్లా మహాసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశం అభివృద్ధి అంటే ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడడం, వారికి నివసించడానికి ఇల్లు కట్టించడం, నిత్యావసరరాల సరుకుల ధరలు అందుబాటులో ఉండేలా చూడడం, యువతకు ఉపాధి కల్పించడం. కానీ నేడు స్వార్థ రాజకీయాలతో ధనికులైన పెట్టుబడి దారులకు, కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలు అమలు చేయడమే అభివృద్ధిగా మారిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు తిక్కయ్య, ఉపాధ్యాయులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.